# బాణసంచాపై డిస్కౌంట్ల మాయ

- ఎక్కువ ధర ముద్రించి తక్కువకు ఇస్తున్నట్లు బురిడీ
- పట్టణంలో 31 బాణసంచా దుకాణాలు


అమ్మకాలకు సిద్ధంగా ఉన్న టపాసులు


కావలిలో ఏర్పాటు చేసిన తాత్కాలిక బాణసంచా దుకాణం

**కావలి :** దీపావళి పండగను పురస్కరించుకుని కావలిలో బాణసంచా దుకాణ యజమానులు డిస్కౌంట్ల పేరుతో కొత్త మాయకు తెరతీశారు. భారీగా పెరిగిన బాణసంచా ధరలకు కొనుగోలుదారులు ఆసక్తి చూపరనే అభిప్రాయానికి వచ్చిన వ్యాపారస్తులు 80 శాతం డిస్కౌంట్ అంటూ ఊదరగొడుతున్నారు. కావలి పట్టణంలో దీపావళి పండగకు ఏటా రూ.3 కోట్ల వ్యాపారం జరుగుతుంది. కాగా ఈ ఏడాది అనుమతులు పొందిన 28 తాత్కాలిక దుకాణాలతో పాటు, మరో మూడు శాశ్వత దుకాణాలు ఉన్నాయి. శాశ్వత దుకాణాల వారు కొన్ని రకాల టపాసులను వారే తయారు చేస్తారు. కాగా చిలకలూరిపేట, విజయవాడ, నెల్లూరు, చెన్నై, ఒంగోలు తదితర చోట్ల ఉన్న హోల్‌సేల్ వ్యాపారుల నుంచి కావలిలోని దుకాణాల నిర్వాహకులు టపాసులను కొనుగోలు చేసి ఇక్కడ అమ్మకాలు చేస్తుంటారు. ఈ ఏడాది టపాసులను తయారు చేయడానికి ఉపయోగించే ముడి పదార్థాలు, రసాయనాల ధరలు పెరగడంతో పాటు ప్రభుత్వం టపాసులపై జీఎస్టీని కూడా పెంచేసింది. దీని ఫలితంగా బాణసంచా ధరలు భారీగా ఉన్నాయి.

**ఇలా అమ్ముతున్నారు..**

పెరిగిన ధరలతో వ్యాపారం కష్టం అని భావించిన వ్యాపారులు టపాసుపై ధరను రూ.1,000గా ముద్రించి ఉంటారు. వాస్తవంగా వాటిని రూ.150 నుంచి రూ.175లకు అమ్మకాలు చేస్తుంటారు. అయితే ప్రస్తుతం ధరను పెంచి 80 శాతం డిస్కౌంట్‌తో అమ్మకాలు చేపడుతున్నారు. కొనుగోలుదారులను బురిడీ కొట్టిస్తున్నారు. ఇలా వాస్తవ ధరలను పెంచి డిస్కౌంట్ పేరిట అమ్మకాలు చేస్తుండడాన్ని వినియోగదారులు గమనించాల్సి ఉంది.

### నిబంధనలు పాటించాలి

దీపావళి పండగ సందర్భంగా బాణసంచా తయారీ, రవాణా, విక్రయాలు, నిల్వల విషయంలో నిబంధనలు విధిగా పాటించాలి. లైసెన్సులు లేకుండా మందుగుండు సామగ్రిని తయారు చేసినా, విక్రయించినా నేరం. అనుమతులు ఉన్న వారు ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటాం.

– గిరిబాబు, సీఐ, కావలి టూ టౌన్ పోలీస్‌స్టేషన్

## క్లుప్తంగా

### కావలి మున్సిపల్ కమిషనర్‌కు అవార్డు



**కావలి :** కావలి మున్సిపాలిటీ కమిషనర్ శ్రావణ్‌కుమార్‌కు అవార్డు వరించింది. ఆత్మ నిర్భర్ పథకం ద్వారా కావలి పట్టణంలోని 3,467 మంది తోపుడు బండ్ల వ్యాపారస్తులకు రూ.10,000 చొప్పున రుణాల మంజూరుకు మున్సిపాలిటీ కృషి చేసింది. అలాగే రుణాలు తీసుకున్న వారిలో నిబంధనలు పాటించిన 1,154 మందికి రూ.20,000, 145 మందికి రూ.30,000ల రుణాలు తిరిగి మంజూరైంది. ఈ పథకాన్ని అమలు చేసే విషయంలో ప్రతిభ చూపడంతో రాష్ట్రంలోని 15 మున్సిపాలిటీలకు అవార్డులు ప్రకటించగా, వాటిలో కావలి కూడా ఉంది. దీంతో విజయవాడలోని తుమ్మల కళాక్షేత్రంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ చేతులు మీదుగా సోమవారం ఆయన అవార్డు అందుకున్నారు.

### సంగం విద్యార్థి ప్రతిభ


నందకుమార్‌రెడ్డి

**సంగం :** త్వరలో జరిగే రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు జిల్లా జట్టు తరఫున సంగం విద్యార్థి ఆడనున్నారు. నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో మంగళవారం జరిగిన ఎంపికల్లో అండర్–17 విభాగంలో జిల్లా క్రికెట్ జట్టులో బౌలర్‌గా సంగం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి నందకుమార్‌రెడ్డి ఎంపికయ్యారు.

### లక్ష్మీపురంలో రెవెన్యూ సదస్సు


అర్జీని పరిశీలిస్తున్న అధికారులు, రైతులు

**కలిగిరి :** లక్ష్మీపురంలోని గ్రామ సచివాలయంలో తహసీల్దార్ చొప్పా రవీంద్రబాబు ఆధ్వర్యంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పలువురు రైతులు రీసర్వేలోని పొరపాట్లు, చుక్కల భూములు, నోషనల్ ఖాతాలు, పొలాలకు ఆధార్ లింక్ సమస్యలకు సంబంధించి వినతి పత్రాలు అందజేశారు. ఆర్‌ఐ పద్మావతి, వీఆర్వో నరేష్ పాల్గొన్నారు.

### పశు వైద్యశిబిరం నేడు

**చేజర్ల :** మండలంలోని పాతపాడు సచివాలయం పక్కన పశువులకు వైద్య శిబిరం, పాడి రైతులకు అవగాహన సదస్సు 30వ తేదీ జరుగుతుందని చేజర్ల, పెళ్లేరు పశు వైద్యాధికారులు రాజేష్, కృష్ణప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పశువులు, గొర్రెలు, మేకలకు సంబంధించి చికిత్స అందిస్తారన్నారు.

### ఒకటి నుంచి పశుగణన

**వరికుంటపాడు :** మండలంలోని పెద్దిరెడ్డిపల్లి, వరికుంటపాడు పశువైద్యశాలల పరిధిలో నవంబర్ 1 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి నెల చివరి వరకు 21వ అఖిల భారత పశుగణన సర్వే కార్యక్రమం జరుగుతుందని మండల పశువైద్యాధికారి రాఘవేంద్రశర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో పశు వైద్యసిబ్బంది ఇంటింటికీ తిరిగి పశువులు, కోళ్లు, ఇతర మూగ జీవాల వివరాలను నమోదు చేస్తారన్నారు. పశు వైద్య సిబ్బందికి పాడి రైతులు, ప్రజలు సహకరించాలన్నారు.

### అనుమతులు తప్పనిసరి

**సోమశిల :** అనంతసాగరం మండల పరిధిలో బాణసంచా దుకాణాల ఏర్పాటుకు తప్పనిసరిగా లైసెన్సులు పొంది ఉండాలని అనంతసాగరం ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డి మంగళవారం తెలిపారు. దుకాణ యజమానులు తప్పక నిబంధనలు పాటించాలన్నారు. లేకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

### రైతు సేవా కేంద్రాల తనిఖీ


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ రవికుమార్

**వరికుంటపాడు :** మండలంలోని జి.కొండారెడ్డిపల్లి, తోటల చెరువుపల్లి గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాలను మండల వ్యవసాయాధికారి వి.రవికుమార్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులు తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు అందించారు. అలాగే ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో సాగుచేసిన పంటలను పరిశీలించి తెగుళ్లు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. వీఏఏలు శ్రీకాంత్, హరనాథ్, రైతులు పాల్గొన్నారు.

### కావలి టూ టౌన్ సీఐగా గిరిబాబు



**కావలి :** కావలి టూ టౌన్ పోలీస్‌స్టేషన్ సీఐగా గిరిబాబు మంగళవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు సీఐగా విధులు నిర్వహిస్తున్న కె.శ్రీనివాసరావును వీఆర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా ఈయన గతంలో కావలి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహించి ఉన్నారు.

### 8న సర్వసభ్య సమావేశం

**సీతారామపురం :** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నవంబర్ 8వ తేదీ ఉదయం ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్య, వ్యవసాయం, తాగునీరు, ఉపాధి హామీ, పంచాయతీరాజ్, గృహ నిర్మాణ తదితర శాఖలపై సమీక్ష నిర్వహిస్తామని, మండలంలోని జెడ్పీటీసీ సభ్యుడితో పాటు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు హాజరుకావాలన్నారు.

### పోలేరమ్మకు పొంగళ్ల సమర్పణ



**అల్లూరు :** స్థానిక అల్లూరు దళితవాడలో కొలువైన పోలేరమ్మకు మహిళలు మంగళవారం పొంగళ్లను సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారి వేప చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

## జాగ్రత్తలు పాటించకుంటే ప్రమాదమే

**సీతారామపురం :** ఆనందోత్సాహాలతో జరుపుకునే దీపావళిని ప్రజలు అనేక జాగ్రత్తల మధ్య జరుపుకోవాలి. లేకుంటే పెను ప్రమాదం తప్పదు.

**ఇలా చేయాలి..**

- బాణసంచా వెలిగించిన వెంటనే దూరంగా జరగాలి.
- పేలని టపాసులను వదిలేయాలి.
- కంటికి రక్షణగా ప్లెయిన్ అద్దాలు వాడాలి.
- ప్రమాదవశాత్తు కంటికి గాయమైతే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.
- టపాసులను కాల్చేటప్పుడు కాటన్ దుస్తులు మాత్రమే ధరించాలి.
- చర్మం కాలితే గాయంపై మంట తగ్గేవరకు నీటిని పోయాలి.
- చిన్నపిల్లలను ఎత్తుకొని బాణసంచా కాల్చకూడదు.
- చిన్నారులు, గర్భిణులు, వృద్ధులు బాణసంచా పేలుళ్లకు దూరంగా ఉండాలి


బాణసంచా వెలిగిస్తున్న యువకుడు

### అనుమతులు తప్పనిసరి



ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండా టపాసులను నిల్వ ఉంచినా, విక్రయించినా చర్యలు తప్పవు. విక్రయ కేంద్రాల వద్ద ఇసుక, అగ్ని మాపక సామగ్రి సిద్ధంగా ఉంచాలి.

– శివకృష్ణారెడ్డి, ఎస్సై, సీతారామపురం

### సొంత వైద్యం వద్దు



బాణసంచా కాల్చేటప్పుడు ఏదైనా ప్రమాదం జరిగితే కొందరు సొంత వైద్యం చేస్తుంటారు. ఇది మంచిది కాదు. వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. ప్రథమ చికిత్స చేసేటప్పుడు కూడా కాలిన గాయాలపై చల్లనినీరు పోయాలి. వెన్న, గ్రీసు, ఇతర పొడర్లను రాయకూడదు.

– స్వప్నారెడ్డి, వైద్యాధికారిణి, సీతారామపురం

## అమరవీరుల సేవలు మరువలేనివి


ఆత్మకూరు : పాఠశాల విద్యార్థులతో సీఐ గంగాధర్


ఉదయగిరి : రక్తదాతలకు ప్రశాంసాపత్రాలు

**ఆత్మకూరు :** పోలీస్ అమరవీరుల సేవలు మరువలేనివని ఆత్మకూరు సీఐ జి.గంగాధర్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ వారోత్సవాల సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను మంగళవారం నిర్వహించారు. మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం సీఐ మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్లకు బానిసలు కావద్దని కోరారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఎస్సై జిలానీ, పోలీస్ సిబ్బంది, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**మెగా రక్తదాన శిబిరం**

**ఉదయగిరి :** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా మంగళవారం ఉదయగిరి పోలీస్ కార్యాలయ ఆవరణలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వెంకట్రావు మాట్లాడుతూ రక్తదానానికి మించిన దానం లేదన్నారు. సర్కిల్ పరిధిలోని సీతారామపురం, వరికుంటపాడు, దుత్తలూరు, ఉదయగిరి మండలాల నుంచి 81 మంది రక్తదానం చేసినట్లు తెలిపారు. ఎస్సైలు ఇంద్రసేనారెడ్డి, ఎ.శ్రీనివాసులు, ఆదిలక్ష్మి, రఘునాథ్ పాల్గొన్నారు.

## వ్యక్తిగత శుభ్రత ముఖ్యం


మాట్లాడుతున్న వైద్యాధికారి అయూబ్‌అప్సర్

**దుత్తలూరు :** వసతి గృహాల విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని దుత్తలూరు వైద్యాధికారి డాక్టర్ అయూబ్‌అప్సర్ తెలిపారు. మండలంలోని దుత్తలూరు, నందిపాడు బీసీ వసతి గృహాలు, నందిపాడు కేజీబీవీ, దుత్తలూరు ఏపీ మోడల్ పాఠశాల వసతి గృహాల్లో విద్యార్థులకు పరిశుభ్రత, డయేరియాపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వసతిగృహ పరిసరాలను పరిశీలించారు. సురక్షిత నీరు తాగాలన్నారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. వసతి గృహాల్లో నీరు నిల్వ లేకుండా వార్డెన్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అపరిశుభ్ర వాతావరణం లేకుండా ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆయా వసతి గృహాల వార్డెన్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన సేవలందించాలి


రికార్డులు పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ భార్గవిరెడ్డి

**సీతారామపురం :** సచివాలయ సిబ్బంది ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని ఈఓపీఆర్డీ భార్గవిరెడ్డి సూచించారు. మండలంలోని పబ్బులేటిపల్లి, మారంరెడ్డిపల్లి సచివాలయాలను ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది సమయపాలన పాటించడంతో పాటు మూడు వేళలా బయోమెట్రిక్ హాజరు వేయాలన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలకు నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలన్నారు. గ్రామాల్లో ఆధార్ లేనివారిని గుర్తించి కార్డు తీయించాలన్నారు. అలాగే గ్రామాల్లో పారిశుద్ధ్య మెరుగుపై దృష్టి సారించాలన్నారు. అనంతరం పలు రిజిస్టర్లను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు అందించారు.

## భక్తిశ్రద్ధలతో గంధ మహోత్సవం


విద్యుద్దీపాలంకరణలో దర్గా

**ఉదయగిరి :** ఉదయగిరి పట్టణంలో ఉన్న హజరత్ సయ్యదినా మహబూబ్ సుభానీ గంధ మహోత్సవం మంగళవారం ప్రారంభమైంది. హక్కుదారుల ఇంటి నుంచి గంధాన్ని బాణసంచా, మేళతాళాలు, ఫకీర్ల జరబులు, విద్యుద్దీపాల నడుమ ఊరేగింపుగా దర్గాకు చేర్చారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం గంధన్ని భక్తులకు పంచిపెట్టారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. హిందూ, ముస్లిం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

### వీఆర్వో బదిలీ

**సీతారామపురం :** మండలంలోని పబ్బులేటిపల్లి వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న జ్యోతి శామ్యూల్ డిప్యూటేషన్‌పై కావలికి బదిలీ అయినట్లు తహసీల్దార్ వెంకటకృష్ణారెడ్డి మంగళవారం తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం రిలీవ్ అయ్యారు.

### పోలీస్ సేవలపై అవగాహన



**సీతారామపురం :** సీతారామపురం పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థులకు మంగళవారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు రక్షణ వ్యవస్థపై పోలీసులు అవగాహన కల్పించారు. ప్రమాదాలు, ఇతర అత్యవసర వేళల్లో పోలీసుల సేవలు ఎలా పొందవచ్చు.. అనే అంశాలను వివరించారు.

### ఆర్థిక సాయం

**అల్లూరు :** మండల పరిధిలోని ఇస్కపల్లికి చెందిన వెంకమ్మ(76) అనారోగ్యంతో మరణించడంతో మంగళవారం ఆమె అంత్యక్రియలకు కేఎస్సార్ ఫౌండేషన్ సభ్యులు రూ.3 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. అంత్యక్రియలకు అంతిమ యాత్ర వాహనాన్ని ఏర్పాటు చేశారు.

### బైకేల దొంగ అరెస్ట్


నిందితుడితో పాటు స్వాధీనం చేసుకున్న బైక్‌లతో ఎస్సై, సిబ్బంది

**మర్రిపాడు :** మండలంలోని పలు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను దొంగలించిన వ్యక్తిని మర్రిపాడు పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై శ్రీనివాసరావు మంగళవారం వెల్లడించిన వివరాల మేరకు.. ఈనెల 23, 24వ తేదీల్లో మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో బైక్‌ల చోరీ జరగడంతో గాలింపు చర్యలు చేపట్టగా గంగుంట కూడలి వద్ద నిందితుడు బత్తుల నవీన్‌ను అదుపులోకి తీసుకున్నారు. రోజుల వ్యవధిలో కేసును ఛేదించిన ఎస్సై, సిబ్బందిని ఎస్పీ కృష్ణకాంత్ అభినందనలు తెలిపారు.

### ఘాట్‌రోడ్డు మరమ్మతులకు వినతి

**ఉదయగిరి :** ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న ఉదయగిరి–బండగానిపల్లి ఘాట్‌రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ఆర్‌అండ్‌బీ డీఈ మదన్ మోహన్‌కు ఆయా గ్రామాల ప్రజలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ వర్షాలకు ఘాట్‌రోడ్డు కోతకు గురికావడంతో వాహనరాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. కొన్నేళ్ల నుంచి ఈ రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా ఉండడంతో 12 గ్రామాల కొండ కింద ప్రజలు ఉదయగిరి మండల కేంద్రానికి రావడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరారు.

## ఆత్మకూరు విద్యార్థుల సత్తా


మెడల్స్ సాధించిన ఆత్మకూరు విద్యార్థులు

**ఆత్మకూరు :** ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రాముఖ్యత కలిగిన జూ జిట్సు గేమ్‌లో ఆత్మకూరు ప్రాంత విద్యార్థులు సత్తా చాటారు. కావలిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఆత్మకూరు నుంచి పాల్గొన్న నలుగురు విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. పట్టణానికి చెందిన ఎం.అక్షయ గోల్డ్‌మెడల్ సాధించగా, బి.తనూజ, వై.వెంకట రాములు సిల్వర్ మెడల్ సాధించారు. అదే క్రమంలో పి.ఫాతిమా కాపర్ మెడల్ సాధించారు. రాష్ట్ర స్థాయిలో మెడల్స్ సాధించడం పట్ల కోచ్ వాసు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు.

## కల్వర్టు ధ్వంసంపై ఫిర్యాదు

**జలదంకి :** మండలంలోని చామదల–కృష్ణాపాడు డొంక బాటలో ఉన్న కల్వర్టును గ్రామానికి చెందిన బద్దిక రామాంజులు అనే వ్యక్తి ధ్వంసం చేశారని స్థానిక రైతులు మంగళవారం జలదంకి పోలీసులకు ఫిర్యాదు చేశారు. 30 ఏళ్ల క్రితం చామదల గ్రామానికి, కృష్ణాపాడు గ్రామానికి డొంక బాటను రైతుల శ్రమదానంతో పాటు విరాళాల సేకరణ ద్వారా ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఆ బాటలో కల్వర్టును కూడా ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. రామాంజులు అనే వ్యక్తి కల్వర్టు కింద ఉన్న 1.40 సెంట్ల భూమిని నాలుగు సంవత్సరాల క్రితం దేవండ్ల నాగయ్య వద్ద కొనుగోలు చేశాడన్నారు. అయితే అతను నాలుగేళ్లుగా కల్వర్టు జోలికి పోకుండా ప్రస్తుతం ధ్వంసం చేసి పైపులను తన ఇంటి వద్ద ఉంచుకున్నట్లు ఫిర్యాదులో తెలిపారు. పోలీసులు విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు.

### ఆరోగ్య కార్డుల పంపిణీ


ఆరోగ్య కార్డులు అందుకున్న విద్యార్థులు

**వరికుంటపాడు :** మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలతో పాటు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు సైతం వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది మంగళవారం హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి కరిష్మా మాట్లాడుతూ మండలంలో 3,500 హెల్త్ కార్డులను విద్యార్థులకు పంపిణీ చేస్తున్నామన్నారు. వైద్య సిబ్బంది సూచించిన తేదీల్లో నెలకోసారి వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య పరిస్థితులను కార్డులో నమోదు చేస్తామన్నారు. అనంతరం ఆమె వరికుంటపాడు, కనియంపాడు గ్రామాల్లో కార్డుల పంపిణీని పరిశీలించి సిబ్బందికి సూచనలు అందించారు.

### పేకాట స్థావరంపై దాడి

- ముగ్గురి అరెస్ట్

**కావలి :** దగదర్తి మండలంలోని కామినేనివారి పాళెం గ్రామం వద్ద ఉన్న అటవీ ప్రాంతాల్లో జరుగుతున్న పేకాట స్థావరంపై పోలీసులు మంగళవారం దాడులు చేశారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ.51,330ల నగదును స్వాధీనం చేసుకున్నారు.

### ఇరువర్గాల ఘర్షణ

**కావలి :** పట్టణంలో సోమవారం రాత్రి జరిగిన ఓ శుభకార్యంలో ఇరువర్గాలకు చెందిన యువకులు ఘర్షణ పడ్డారు. ఇందులో నిర్వాహకులకు సంబంధించిన కారు ధ్వంసమైంది. కాగా ఈ విషయమై నిర్వాహకులు కావలి వన్ టౌన్ పోలీసులకు సమాచారం అందించడంతో వారు రంగప్రవేశం చేసి ఓ వర్గం వారిని తమదైన శైలిలో విచారించారు. కాగా ఇరువర్గాల వారు సంయమనం పాటించాలని సర్ది చెప్పారు.

### విజిలెన్స్ అధికారుల పరిశీలన

**వింజమూరు(ఉదయగిరి) :** మండలంలోని వింజమూరులో ఉన్న మూడు మద్యం షాపులను విజిలెన్స్ అధికారులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

### యాజమాన్య పద్ధతులు పాటించాలి


కంది పంటను పరిశీలిస్తున్న ఏఓ చెన్నారెడ్డి

**సీతారామపురం :** పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి పి.చెన్నారెడ్డి తెలిపారు. మండలంలోని జయపురం, పోకలవారిపల్లి గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మంగళవారం పాల్గొని, మాట్లాడారు. కంది, వరి పంటలను పరిశీలించి వాటికి సోకిన తెగులు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఏఈఓ సాంబశివయ్య, ఏహెచ్‌ఏ శైలేంద్ర, వీఏఏ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

- **చేజర్ల :** వరి నారును సకాలంలో పోసుకోవాలని మండల ఏఓ శిరిధర్ అన్నారు. మండలంలోని యనమదల, చిత్లూరు రైతుసేవా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేఎన్‌ఎం–1638, ఆర్‌ఎన్‌ఆర్–15048 విత్తనాలను నవంబర్ 15 నుంచి డిసెంబర్ 15లోపు పోసుకోవాలన్నారు. యనమదలలో భూసార పరీక్ష పత్రాలను రైతులకు అందజేశారు. ఏఈఓ సుజాత, వీఏఏలు మాధురి, హసన్ పాల్గొన్నారు
- **దుత్తలూరు :** సాగులో ఉన్న వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల ఏఓ ఎస్.వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. మండలంలోని తెడ్డుపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా వరిపంటను పరిశీలించి పచ్చపురుగు ఉన్నట్లు గుర్తించారు. నివారణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బోయపాటి వెంకటరత్నం, ఏఈఓలు సుధీర్, సుస్మిత పాల్గొన్నారు.
- **అనుమసముద్రంపేట :** మండల కేంద్రమైన ఏఎస్‌పేట, అనుమసముద్రం గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో మండల ఏఓ రజనీ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ దేవసేనమ్మ రైతులకు పలు సూచనలు చేశారు. ఏఈఓ చిరంజీవి, వై.భాగ్యలక్ష్మి, వీఏఏ జి.రమ, వీఏహెచ్ యస్దానిబాషా పాల్గొన్నారు.
- **మర్రిపాడు :** మండలంలోని ఇర్లపాడు, ఏపిలగుంట గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండల ఏఓ ఎస్.రామ్మోహన్ నిర్వహించారు. ఇర్లపాడులో సాగులో ఉన్న మిరప పంట, ఏపిలగుంట గ్రామంలో వరి పైరును పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు.